సొంతింటి కల.. సాకారమయ్యేనా!

● నిరుపేదల్లో మళ్లీ చిగురిస్తున్న ఆశలు
● జిల్లాలో 255 ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఎన్నికల హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుడుతోంది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పుర కమిషనర్లతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మొత్తం 255 కమిటీలను ఏర్పాటు చేసి కలెక్టర్‌కు నివేదించినట్లు అధికారులు చెబుతున్నారు.

గ్రామ పంచాయతీ స్థాయిలో...

గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి కమిటీ ఛైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. కమిటీ సభ్యులుగా ఇద్దరు డ్వాక్రా సంఘం మహిళలు, ముగ్గురు స్థానికులను నియమించారు. వీరిలో ఒకరు బీసీ, ఒకరు ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారికి అవకాశం కల్పించారు.

పురపాలిక వార్డుల స్థాయిలో...

వార్డు కౌన్సిలర్ ఛైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా ఇక్కడ కూడా పంచాయతీ తరహాలోనే ఐదుగురిని ఎంపిక చేశారు.

✦ ఎంపీడీవోలు, పుర కమిషనర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఎంపిక చేసి కలెక్టర్‌కు అందించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో కలెక్టర్ కమిటీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తారు. వీరికి మండల, పురపాలిక స్థాయిలో అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లాలో 83,671 దరఖాస్తులు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకైతే రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని మూడు విడతలుగా అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించింది. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు సైతం దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకునేందుకు 83,671 మంది దరఖాస్తు చేసుకున్నారు.

సీనియర్ల నుంచి విమర్శలు

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో భారాస, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. కమిటీ సభ్యులను ఎంపీడీవోలు, పుర కమిషనర్లు ఎంపిక చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలమైన వారిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారని, సీనియర్లకు అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేయడం గమనార్హం. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఎంపికలో ఇష్టారాజ్యం, పేరుకే కమిటీలు, అంతా నాయకుల కనుసన్నల్లోనే కమిటీలను ఏర్పాటు చేశారన్న ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ విషయమై ఈ నెల 18న గాంధీ భవన్‌లో, ప్రజాదివస్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు సామాజిక మాధ్యమాల వేదిక ద్వారా పేర్కొన్నారు.

ఎంపిక పూర్తి

- శేషాద్రి, జిల్లా ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారి

జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి కలెక్టర్‌కు నివేదించాం. కమిటీల ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కాలేదు. కమిటీల వివరాలను కలెక్టర్ జిల్లా మంత్రికి అందజేశారు.

కాటమయ్య కిట్టు.. ప్రాణాలకు భరోసా

● జిల్లాలో 400 మంది గీత కార్మికులకు పంపిణీ


రక్షణ కవచం ధరించడంతో చెట్టుకు వేలాడుతున్న గీత కార్మికుడు

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

కల్లు గీత కార్మికులు తాటి, ఈత చెట్టు ఎక్కే సమయంలో ప్రమాదం జరుగుతుండటంతో తీవ్ర గాయాల పాలవుతున్నారు. కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక నుంచి ఏ ఒక్క గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి ప్రాణాలు కోల్పోకుండా చూడాలని భావించింది. ప్రమాదాల బారి నుంచి రక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లను తయారు చేయించి పంపిణీకి శ్రీకారం చుట్టింది.



జిల్లా బీసీ సంక్షేమ శాఖ, ఆబ్కారీ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 400 మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఇప్పటికే వాటిపై శిక్షణ కూడా ఇచ్చారు. తాటి, ఈత చెట్లు ఎక్కేటప్పుడు వీటిని ధరించడం వల్ల ప్రమాదం జరగకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆరు రకాల వస్తువులు

కల్లుగీత కార్మికులకు అందించే కాటమయ్య రక్షణ కవచం కిట్టులో ఆరు రకాల వస్తువులు ఉన్నాయి. తాడు, క్లిప్పులు, హ్యాండిల్, స్లింగ్ బ్యాగ్, లెగ్‌లూప్ వంటివి ఉన్నాయి.

✦ తాటి చెట్టు ఎక్కే సమయంలో నడుముకు ముత్తాదు, చెట్టు ఎక్కడానికి ఉపయోగించే మోకుతో పాటు రెండు కాళ్లకు గుయి ధరించి ఎక్కుతారు.

✦ ఎక్కే సమయంలో ప్రమాదవశాత్తు మోకు జారినా, లేక రెండు కాళ్లకు ఉన్న గుయి పడిపోయినా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నుంచి రక్షించడానికి ప్రత్యేకంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లను తయారు చేశారు.

✦ కిట్టులోని పరికరాలను నడుముకు బిగించుకొని తాడుతో మోకుకు అనుసంధానం చేసి చెట్టు ఎక్కాలి. ప్రమాదవశాత్తు మోకు జారిపోయినా, గుయి కింద పడినా జారి పడకుండా కిట్టుకు ఉన్న తాడు చెట్టుకు బిగుసుకుపోతుంది. దీంతో చెట్టుపై నుంచి పడకుండా అక్కడే ఉండి పోతారు. అనంతరం వారు కాలికి ధరించిన లెగ్‌లూప్ సహాయంతో చెట్టును సులభంగా దిగ గలుగుతారు.

✦ ఈ కిట్టు 2,200 కిలోల బరువును ఆపుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి

- రాజమనోహర్‌రావు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి

గీత కార్మికులకు అందించిన కాటమయ్య రక్షణ కవచం కిట్లను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ఈ కిట్టు వినియోగంపై గీత కార్మికులకు శిక్షణ అందించాం. దీనిని ధరించి ప్రమాదం జరగకుండా చూసుకోవాలి.

కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించండి

ఈనాడు స్పందనకు వందనం


నిజామాబాద్ కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

నిజామాబాద్ (కోనరావుపేట), న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో రైతులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ఈనెల 17న 'ఈనాడు'లో 'అరకొర వసతులు... అన్నదాత అవస్థలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని, అకాల వర్షానికి ధాన్యం తడవకుండా రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తూకానికి ఎటువంటి ఆటంకం కలగకుండా సరిపడా గన్నీ సంచులు నిల్వ చేసుకోవాలన్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేసిన నాణ్యమైన ధాన్యం వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. సన్నరకం ధాన్యం కొనుగోలు సమయంలో అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో రైతులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సరఫరా, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, మేనేజర్ రజిత, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డులో టార్పాలిన్ కవర్లపై నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

రైతులకు తీవ్ర నష్టం


రాచర్ల బొప్పాపూర్: ధాన్యాన్ని పారతో ఒక చోటుకు చేర్చుతున్న రైతు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం వేకువజామున అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట కోతలు ముగించుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు పలు గ్రామాల్లోని కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టడం, కొట్టుకుపోయిన ధాన్యాన్ని సేకరించేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు. రాచర్ల బొప్పాపూర్, పదిర, గొల్లపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో కోత దశలో ఉన్న వరిపైరు నేలవాలింది. మళ్లీ వర్షాలు పడితే నేలకొరిన పైరులోని గింజలు పొలంలోనే మొలకెత్తే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


చందుర్తిలో కవర్లు కప్పుతున్న రైతులు

ఆర్టీసీకి దసరా పండుగ

14 రోజుల్లో రూ.31 కోట్ల ఆదాయం



న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

దసరా పండుగ ఆర్టీసీకి గణనీయ ఆదాయం తెచ్చింది.. రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులు నడపడం.. లక్షలాది మంది బస్సుల్లో ప్రయాణించడంతో సంస్థకు రూ.కోట్ల ఆదాయం సమకూరింది. పాఠశాలలకు ఈ నెల 2న సెలవులు ప్రకటించగా 1వ తేదీ సాయంత్రం నుంచే ప్రారంభమైన రద్దీ 16వ తేదీ వరకు కొనసాగింది.. సంస్థ రూ.31.49 కోట్ల ఆదాయం ఆర్జించింది.

ప్రత్యేక ఏర్పాట్లతో..

పండుగల సందర్భంగా రద్దీ అధికంగా ఉంటుందని భావించిన ఆర్టీసీ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో సాగారు. జేబీఎస్‌తోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, హనుమకొండ ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడిపారు. సరిపడా బస్సులు లేకపోవడంతో హైదరాబాద్ నుంచి సిటీ బస్సులను తెప్పించి రద్దీకి అనుగుణంగా పంపించారు. ఈ నెల 3 నుంచి 11 వరకు డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు, సూపర్‌వైజర్లు జేబీఎస్‌లో మకాం వేసి రద్దీని పరిశీలిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు ఎస్.భూపతిరెడ్డి, సత్యనారాయణ కరీంనగర్ బస్టాండ్‌లోనే ఉంటూ రద్దీని స్వయంగా పరిశీలిస్తూ ఆయా రూట్లలో బస్సులు తిరిగేలా చూశారు.

డిపోల వారీగా..

● ఆదాయపరంగా గోదావరిఖని డిపో రూ.5.27 కోట్లతో మొదటి స్థానంలో నిలవగా, హుస్నాబాద్ డిపో రూ.1.43 కోట్లతో చివరి స్థానంలో నిలిచింది. ప్రయాణికులపరంగా గోదావరిఖని డిపో 9.79 లక్షల మంది ప్రయాణికులను (మహిళలు 6.87 లక్షలు) చేరవేసి ప్రథమ స్థానంలో నిలవగా, వేములవాడ డిపో 5.16 లక్షల మందిని (మహిళలు 3.95 లక్షలు) చేరవేసి చివరి స్థానంలో నిలిచింది.

సమష్టి కృషితోనే సాధ్యమైంది :

లక్షలాది ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చడంలో సిబ్బంది పాత్ర ప్రశంసనీయం. డ్రైవర్లు, కండక్టర్లు, కంట్రోలర్లు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు ఇతర సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాం.

- సుచరిత, రీజినల్ మేనేజర్, కరీంనగర్ రీజియన్

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)
గోదావరిఖని	5.27
కరీంనగర్-2	4.23
జగిత్యాల	4.21
కరీంనగర్-1	3.38
వేములవాడ	2.32
సిరిసిల్ల	2.27
కోరుట్ల	2.25
మెట్‌పల్లి	2.14
హుజూరాబాద్	2.11
మంథని	1.83
హుస్నాబాద్	1.43

● తిరిగిన ట్రిప్పులు : 12,726
● దూరం : 53.32 లక్షల కిలోమీటర్లు
● మొత్తం ప్రయాణికులు : 61,11,849
● మహిళలు : 42,34,544 (69 శాతం)

ఘనంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం


స్వామివారు


ఊరేగింపులో విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్వామివారి ఆలయంలో ఉదయం 5 గంటలకు రథ హోమం నిర్వహించారు. 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రథంపై స్వామివారి దర్శనం, మొక్కుల చెల్లింపులు జరిగాయి. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో రథాన్ని ఊరేగించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నిత్య హోమం, నివేదన, తీర్థప్రసాద వితరణ జరిగాయి. అశ్వవాహనంపై దోపు కథ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతీరావు, అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, కమిటీ సభ్యుడు కోడం శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి, న్యూస్‌టుడే: కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోసం కొండంత.. వసూలు గోరంత!

సవాలుగా జీఎస్టీ అక్రమాల కేసు



ఈనాడు, కరీంనగర్

జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేలడం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టీషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు.

వచ్చింది 5 శాతమే..

కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా.. ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది. పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌ఛార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

కోనరావుపేట, న్యూస్‌టుడే

? వేములవాడ-మరిమడ్ల వరకు మామిడిపల్లి మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులు తక్కువగా ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం ఉన్నత విద్యను అభ్యసించేవారు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా బస్సులు నడిపించాలి. **- నంద్యాడపు మంజుల, మామిడిపల్లి**

✔ వేములవాడ-మరిమడ్ల మార్గంలో గతంలో నడిపిన విధంగా ఆర్టీసీ ట్రిప్పులు నడిపిస్తున్నాం. ప్రభుత్వం కొత్త బస్సులు కేటాయిస్తే ట్రిప్పుల సంఖ్య పెంచేందుకు పరిశీలిస్తాం. బస్సుల సంఖ్య ఆధారంగా ఆయా మార్గాల్లో నడిపిస్తున్నాం. **- శ్రీనివాస్, ఆర్టీసీ డిపో మేనేజర్, వేములవాడ**

రహదారిపై కుప్పలు.. వాహనదారులకు తిప్పలు



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రెండో బైపాస్ రహదారిలో కలెక్టరేట్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు దాదాపు 11 కిలోమీటర్ల వరకు ధాన్యం కుప్పలు పోస్తున్నారు. దీంతో అవి రాత్రి సమయంలో కనిపించకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులపై ధాన్యం ఆరబోయవద్దని పోలీసులు పదేపదే చెబుతున్నా రైతులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనితో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్**

ఎండిన మొక్కలు.. పట్టించుకోని అధికారులు



రాజన్న సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొదురుపాక నాలుగు వరుసల డివైడర్ మధ్యలో మొక్కలు ఎండిపోయినా పట్టించుకునే వారు కరవయ్యారు. రహదారికి ఇరువైపులా డివైడర్ మధ్యలో పచ్చదనం కోసం గతంలో మొక్కలు నాటారు. పంచాయతీ పాలకవర్గం ఉన్నంత వరకు మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదు. మొక్కలు ఎండిపోయి, పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగాయి. వన మహోత్సవంలో భాగంగా ఎండిపోయిన వాటి స్థానంలో తిరిగి నాటేందుకు అధికారులు శ్రద్ధ చూపలేదని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బోయినపల్లి**

వైకుంఠ రథానికి మరమ్మతులు

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: అంతిమయాత్రకు కష్టాలు తప్పడం లేదు. వైకుంఠ రథం మృతదేహాన్ని మోసుకెళ్లేక నానా అవస్థలు పడుతున్న విషయంపై ఆగస్టు 8న 'ఈనాడు'లో 'ముందుకు కదలని వైకుంఠ రథం' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి పురపాలక సంఘం అధికారులు స్పందించారు. ఎట్టకేలకు మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం కావడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేసిన వైకుంఠ రథం

కాలువ శుభ్రం

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సులభ్ కాంప్లెక్స్ ఎదుట ప్రధాన కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనితో మురుగు ముందుకు వెళ్లడం లేదు. ఈగలు, దోమలు బెడద పెరిగి దుర్గంధం వస్తున్న విషయంపై ఈ నెల 17న 'ఈనాడు'లో 'మేమున్నాం... మీకు తోడుగా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పురపాలక సంఘం అధికారులు స్పందించారు. ప్రధాన మురుగు కాలువను శుభ్రం చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షం... తడిసిన ధాన్యం



ముస్తాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



పోత్గల్‌లో పరిశీలిస్తున్న డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు, రైతులు

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వర్షానికి కొట్టుకుపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని ఆయా గ్రామాల అన్నదాతలు కోరారు.

చందుర్తి: చందుర్తి మండలంలో వర్షాలకు అన్నదాతలకు తీరని నష్టం జరిగింది. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కళ్ల ముందే తడిసి ముద్దవడంతో రైతులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణ పనులకు నిధులు

చందుర్తి: చందుర్తి మండలంలోని పలు గ్రామాల రహదారి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సనుగుల నుంచి గంగిరెద్దుల కాలనీ వరకు రోడ్డు ఏర్పాటుకు రూ.కోటి మంజూరయ్యాయి. మూడపల్లి గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి హైస్కూల్ వరకు స్లాబ్, కల్వర్టు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్‌కు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు పడక గదుల ఇళ్లను ఆక్రమిస్తే చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లోని రెండు పడక గదుల ఇళ్లను ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల ఆర్డీవో రమేశ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం రెండు పడక గదుల ఇళ్లను పరిశీలించారు. పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల కొందరు ఎలాంటి అనుమతి లేకుండా, పట్టా లేకుండా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. వారి ప్రయత్నాలను పోలీసుల సహాయంతో అడ్డుకున్నట్లు చెప్పారు. శాంతినగర్‌లో మొత్తం 204 ఇళ్లను గత ప్రభుత్వ హయాంలో నిర్మించామని, వివిధ వివాదాల కారణంగా లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత మిగిలిపోయిన ఇళ్లను ఎలా పంపిణీ చేయాలనే దానిపై విధివిధానాలు ఇంకా విడుదల కాలేదని చెప్పారు. ఏ ప్రజాప్రతినిధి కూడా వారి రాజకీయ అవసరాల కోసం వాడుకోరాదని పేర్కొన్నారు.

తిరుమల తరహాలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల (గ్రామీణం, న్యూస్‌టుడే: సుమారు 800 ఏళ్ల చరిత్ర కలిగిన సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన రథోత్సవానికి ప్రభుత్వం తరఫున ఆయన హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

బోయినపల్లి, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీలో తీసుకున్న అనుమతికి విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విలాసాగర్‌లో ఓ వ్యక్తి గృహ నిర్మాణం (ఆర్‌సీసీ భవనం) కోసం అనుమతి తీసుకున్నాడు. అనుమతి తీసుకున్న విస్తీర్ణం కంటే అధికంగా నిర్మాణం, ప్రహరీ, ఈత కొలను కట్టాడు. గృహ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీలో అనుమతి తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేపట్టడంపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. డీటీపీసీ అనుమతితో నిర్మాణం చేపట్టాల్సి ఉండగా గృహ నిర్మాణం పేరుతో గ్రామ పంచాయతీలో అనుమతి పొంది నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో అధికారులు విచారణ చేపట్టినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా గృహ నిర్మాణం పేరుతో అనుమతి పొంది ఫాంహౌస్ కట్టడంతో నోటీసు జారీ చేసినట్లు చెప్పారు.



ఈత కొలను పరిశీలిస్తున్న అధికారులు

ముస్తాబాద్ మహర్షి పాఠశాల గుర్తింపు రద్దు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: జిల్లాలోని ముస్తాబాద్ మహర్షి పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ముస్తాబాద్ మండల విద్యాధికారి అందించిన నివేదిక ప్రకారం నర్సరీ చదువుతున్న చిన్నారి మనోజ్ఞ ప్రమాదవశాత్తు బస్సు టైర్ కింద పడి అక్కడికక్కడే మరణించిందని, ఈ సంఘటన స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా జరిగిందని అందులో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, పీడబ్ల్యూడీ శాఖ నుంచి భవన స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ ఉండాలని, మహర్షి హైస్కూల్ మేనేజ్‌మెంట్ పేర్కొన్న ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదని తెలిపారు. వాహన పార్కింగ్, నిర్వహణ అంశంలో రవాణాశాఖ నిబంధనలు పాటించలేదని, పిల్లల రవాణా సమయంలో స్కూల్ యాజమాన్యం పాటించాల్సిన జాగ్రత్తలు సైతం పాటించడంలో వైఫల్యం చెందడం వల్ల ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని పేర్కొన్నారు. సరైన బిల్డింగ్ అనుమతులు లేవని, రవాణా సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు పాటించడం లేదని, పాఠశాలలోని పిల్లలకు, సిబ్బంది ప్రాణాలకు ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని పాఠశాల గుర్తింపు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.



బోయినపల్లిలో రాస్తారోకో చేస్తున్న శ్రీధర్, తదితరులు

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రాస్తారోకో

బోయినపల్లి, న్యూస్‌టుడే: పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7500 అందే విధంగా చూడాలని కోరుతూ బోయినపల్లిలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. లైసెన్స్ లేని వ్యాపారులు గ్రామాల్లో రైతుల నుంచి పత్తి సేకరించి దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, రాజలింగం, పలువురు రైతులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై ఏఎస్పీ విచారణ

బోయినపల్లి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి గురువారం మల్కాపూర్ గ్రామంలో విచారణ చేపట్టారు. దుర్గామాతకు అలంకరించిన చీరలను ఈ నెల 12న వేలం వేస్తుండగా ప్రసాద్, పర్శ రాములు, సాయి, అనిల్‌లు కులం పేరుతో దూషించారని బాధితుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏఎస్పీ సాక్షులను విచారించి వివరాలు తెలుసుకున్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళం

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ పరిధిలోని చింతలపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి సిరిసిల్ల సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు గురువారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారాస జిల్లా నాయకులు చీమల ప్రశాంత్, సామనపల్లి శేఖర్, మామిడ్ల మహేశ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆవునూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: ఇటీవల వారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూర్ జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ గురువారం తెలిపారు. విజేతలను డీఈవో రమేశ్ కుమార్ గురువారం అభినందించారు.

గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు రూ.56,440 కోట్ల వడ్డీ

వేములవాడ, న్యూస్‌టుడే: గత పది నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన రుణాలు రూ.49,618 కోట్లు అయితే, గత భారాస ప్రభుత్వం తెచ్చిన రూ.7 లక్షల కోట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.56,440 కోట్ల వడ్డీ చెల్లించిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.49,618 కోట్ల మార్కెట్ రుణాలు తీసుకుందని తెలిపారు. ప్రజోపయోగమైన నిర్మాణ పనులకు, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులు మూలధన వ్యయంగా ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పార్టీ గ్రామీణ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా టీఎంసీ రాజమణి మృతి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల పురపాలక సంఘంలోని మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్ (టీఎంసీ) రాజమణి గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, మెప్మా సిబ్బంది సంతాపం తెలిపారు.

ఘనంగా చండీ హోమం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండా, మైసమ్మ, శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో చండీహోమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్చారణల నడుమ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. పలు కార్యాలయాల్లోనూ నివాళులర్పించారు.

రుణాలు ఇచ్చి లబ్ధిదారులను వేధించొద్దు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: మైక్రో ఫైనాన్స్ బ్యాంకులు రుణాలు ఇచ్చిన తర్వాత లబ్ధిదారులు తిరిగి చెల్లించేటప్పుడు ఎలాంటి వేధింపులకు గురి చేయవద్దని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. గురువారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో మైక్రో ఫైనాన్స్ బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. రుణాలు ఇచ్చినప్పుడు కట్టడానికి కొంత సమయం ఇవ్వాలని, అధిక వడ్డీలు వసూలు చేయవద్దని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకులు రుణాలు ఇచ్చి వారి ఇళ్లకు వెళ్లి వేధింపులకు గురిచేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై రామ్మోహన్, మైక్రో ఫైనాన్స్, ఆశ్విరాద్, బంధన్, స్పందన, ఐఐఎఫ్ఎల్, ఫ్యూజియం, పిన్‌కేర్ తదితర బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొంటాం

కోనరావుపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి, రైతును రాజు చేయాలన్న సంకల్పంతో పని చేస్తుందని వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి, నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, డీసీఎస్‌వో వసంతలక్ష్మి, డీఎం రజిత, డీసీవో రామకృష్ణ, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, కోనరావుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం నిమ్మపల్లి, జైసేవాలాల్‌తండా, జైసేవాలాల్ అజ్మీరాతండా, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో శేషాద్రి గురువారం ప్రారంభించారు.



నిజామాబాద్ కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

తంగళ్లపల్లి: సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప గురువారం తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్, గండిలచ్చపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

వాహనం ఢీకొని వివాహిత దుర్మరణం

వర్గల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వివాహిత మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్ కుటుంబ సభ్యులతో హైదరాబాద్ దోమలగూడలో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. పండగకు ఇంటికి వెళ్లారు. తిరిగి తల్లి గోపన్నగారి వనిత(46)ను ద్విచక్ర వాహనంపై కూర్చోపెట్టుకొని హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దేవేందర్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోయారు. తల్లి వనిత రోడ్డుపై పడటంతో ఢీకొట్టిన వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. వనితకు భర్త, ఇద్దరు కుమారులు దేవేందర్, చాణక్య ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్ (27) ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై సర్దాపూర్‌లోని పెట్రోల్ బంక్‌లో పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి రగుడు-వెంకటాపూర్ బైపాస్ రోడ్డు మీదుగా చంద్రంపేట వస్తున్నాడు. బోనాల, చిన్నబోనాల పరిసర ప్రాంతంలో బైపాస్ రోడ్డుపై ఉన్న వడ్ల కుప్ప చీకట్లో కనిపించకపోవడంతో ఎక్కించాడు. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోగా రాజశేఖర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి తల్లి సుజాత, సోదరుడు, సోదరి ఉన్నారు.



రాజశేఖర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ శివారులోని మానేరు కరకట్ట వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటాయి. మెడలో తెలుపు, పసుపు రంగు దారంతోపాటు కుడి చెయ్యికి రాగి కడెం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712656366 నంబర్‌కు గానీ, సిరిసిల్లలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

కనుల పండువగా రథోత్సవం



ముస్తాబాద్‌లో దర్శించుకుంటున్న భక్తులు

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండల కేంద్రంలో రథోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శివకేశవుల ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరులను ఒక రథంపై, పద్మావతి, శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను మరో రథంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఎల్సాని దేవయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ సనాతన ధర్మ రక్షణే ధ్యేయం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: హిందూ సనాతన ధర్మ రక్షణే ధ్యేయమని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే, రాష్ట్ర గౌరవ సలహాదారుడు రాజు గురుస్వామి పేర్కొన్నారు. గురువారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అఖండ భజన సంకీర్తనల కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహా పడిపూజ నిర్వహించారు. భజన బృంద భజనలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుస్వాములు కేశవ, హరినారాయణ, సతీశ్, ఏడుకొండలు, ఈదుల రవీందర్‌రెడ్డి, ఎర్రోజు గోపాలచారి, రఘుస్వామి తదితరులు పాల్గొన్నారు.



గానం అలపిస్తున్న భక్తులు

శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని అయ్యప్ప స్వాములు సిరిసిల్ల నుంచి శబరిమలకు గురువారం పాదయాత్ర చేపట్టారు. విద్యాసాగర్ గురుస్వామి ఆధ్వర్యంలో బయలుదేరారు. డిసెంబర్ 2న అక్కడికి చేరుకుంటామని అయ్యప్పస్వాములు తెలిపారు.



గంభీరావుపేటలో కల్యాణం

కల్యాణం.. కమనీయం

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని సీతారాంబజార్ కాలనీలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగ, పద్మావతిల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లింగన్నపేట హరిహర దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు గరుడ సేవపై ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తున్న ఐదుగురిపై కేసు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినుల పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో విద్యార్థినుల పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి, లేదా వారి అకౌంట్ హ్యాక్ చేసి వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం వేదికగా గానీ, పని చేసే ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలల్లో మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఏటీఎం చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలో సంజీవయ్యనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తుతెలియని వ్యక్తి సుత్తితో పగులగొట్టి చోరీకి యత్నించాడు. ఫలితం లేకపోవడంతో ఏటీఎంలోని సీసీ కెమెరాల సీలింగును పగులగొట్టాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో ఐదు గంటల వ్యవధిలో నిందితుడిని గుర్తించారు. కరీంనగర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆకుబత్తిని శ్రీకాంత్‌గా గుర్తించి సిరిసిల్లలోని ధోబీ గల్లీలో ఉన్న అతనిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

వీసా పేరుతో మోసం చేసిన...

బోయినపల్లి, న్యూస్‌టుడే: వీసా పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గురువారం వేములవాడ గ్రామీణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన వెంకటేశ్ ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలానికి చెందిన కల్యాణ్ రమేశ్ అలియాస్ దండుగుల కల్యాణ్ వర్క్ వీసాపై గల్ఫ్‌కు పంపిస్తానని వెంకటేశ్ వద్ద రూ.75 వేలు తీసుకొని టూరిస్ట్ వీసాపై పంపించాడు. గల్ఫ్ వెళ్లిన వెంకటేశ్ విషయం తెలుసుకొని మోసపోయినట్లు గుర్తించి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కల్యాణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కల్యాణ్ మరికొంత మంది వద్ద డబ్బులు తీసుకొని మోసం చేసినట్లు తెలిసిందన్నారు. కల్యాణ్ బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని సిరిసిల్ల పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ కోరారు. తమకు కేటాయించిన ఇళ్లలో తాము నివాసముండేలా చూడాలని లబ్ధిదారులు గురువారం పురపాలక సంఘం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మొత్తం 1,800 రెండు పడక గదుల ఇళ్లు నిర్మించగా, పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. శాంతినగర్ పరిధిలో నిర్మించిన ఇళ్లలో ఎన్నికల కోడ్, అసంపూర్తి పనుల కారణంగా ఇళ్ల కేటాయింపు వాయిదా వేశామన్నారు. శాంతినగర్‌లో 100 ఇళ్లు ఎస్సీలకు కేటాయించగా, మిగిలిన 105 ఇళ్లు డ్రా పద్ధతిలో ఎంపికైన వారికి ఇవ్వాలని పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా ఇళ్లలోకి వెళ్లిన లబ్ధిదారులను పోలీసులు, అధికారులు ఖాళీ చేయాలని చెబుతున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారుల పక్షాన ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తుందని, ఎవరూ అధైర్య పడొద్దని తెలిపారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ కళ

క్రీడలతో మానసికోల్లాసం

సిరిసిల్ల(విద్యానగర్): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సిరిసిల్ల పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడోత్సవాల ప్రారంభానికి ఛైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, దేవతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు గేదె మృతి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి రవికి చెందిన గేదె పొలం వద్ద మేత మేస్తుండగా గురువారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

గంభీరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఇరబోయిన అశ్విన్ అనే బాలుడిపై గురువారం కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. గంభీరావుపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు చికిత్స అందజేశారు.

కత్తులు దూస్తున్న బంధుత్వాలు

■ రక్త సంబంధీకుల మధ్య పెరుగుతున్న హత్యలు


■ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విపరీత ధోరణి

న్యూస్‌టుడే- మేడిపల్లి, జగిత్యాల

అమ్మ కడుపులో గోడలు, గొడవలు తెలియకుండా పురుడు పోసుకున్న అన్నదమ్ములు.. పెరిగి పెద్దయిన కొద్దీ బంధాలను మరిచిపోయి కత్తులు దూసుకుంటున్నారు. పురాణాల నుంచీ సంస్కృతీ సంప్రదాయాలకు నెలవుగా ఉన్న సోదర బంధాన్ని హత్యల మాటున దూరం చేసుకుంటున్నారు. కడదాకా తోడుంటామని బాస చేసుకున్న భార్యాభర్తల నడుమ అనుమానం, వివాహేతర సంబంధాలతో గొంతు నులుముకుంటున్నారు. అల్లారుముద్దుగా ఆప్యాయతలు పంచిన తల్లిదండ్రులే తమ రక్త సంబంధాలను చిదిమేస్తున్నారు. తల్లిని కుమారుడు, కుమారుడిని తండ్రి హతమారుస్తున్న సంఘటనలు ప్రతి ఒక్కరినీ కలచి వేస్తున్నాయి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవల ఛిద్రమైన బంధాల సాక్షిగా పెరుగుతున్న హత్యలపై కథనం...

15 రోజులు.. 7 హత్యలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 15 రోజుల్లో మొత్తం 8 హత్యలు జరిగితే అందులో 7 రక్తసంబంధీకుల మధ్య జరిగినవే కావడం విపరీత ధోరణికి అద్దం పడుతోంది. పెరుగుతున్న ఆస్తుల విలువ, మద్యం, వివాహేతర సంబంధాలు, అసూయ తదితరాలు కుటుంబ బంధాల మధ్య అంతరాలను పెంచుతున్నాయి. సోదరుల మధ్య సంబంధాలు చెడిపోతున్నాయి. భార్యాభర్తలు కొందరిలో చిన్న చిన్న కారణాలే హత్యలకు దారితీస్తున్నాయి. ఇటీవల జరిగిన రక్త సంబంధీకుల హత్యల్లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో రెండు చొప్పున హత్యలు జరగగా పెద్దపల్లి జిల్లాలో ఒక హత్య కేసు నమోదైంది.



■ హుజూరాబాద్ మండలం రాజపల్లికి చెందిన నోముల అంజి మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చుకునేందుకు తనకు వ్యవసాయ భూమి ఇవ్వాలంటూ అన్న రాజుతో గొడవపడ్డాడు. అన్నను హతమారిస్తే భూమి తనదే అవుతుందనే దుర్బుద్ధితో ఈ నెల 4న రాజును హత్య చేశాడు. బాధాకరమేమిటంటే తల్లిదండ్రులు కూడా తమ పెద్ద కుమారుడి హత్యకు చిన్న కుమారునికి సహకరించారు.

కారణాలు: **మద్యం మత్తు, ఆస్తి కాజేయాలనే దురుద్దేశం**

■ గోదావరిఖని యైటింక్లైన్ కాలనీలో కాకినాడ అంజలి అనే వివాహిత వినయ్‌కుమార్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉండటంతో భర్త శివరామ క్రిష్ణ, అతని సోదరుడు కుమార్ కలిసి వినయ్‌కుమార్‌ను ఈ నెల 10న హతమార్చారు. కుటుంబసభ్యులు, ఇతరుల ఆదరణ కోల్పోయిన అంజలి తన సొంత పట్టణమైన గుంటూరులో ఆత్మహత్య చేసుకుంది. కారణం: **వివాహేతర సంబంధం**

■ అక్టోబరు 9న.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో చంద్రయ్య తన సోదరుడు కుమారస్వామితో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో కుమారస్వామి దాడి చేయడంతో తమ్ముడు చంద్రయ్య మృతిచెందాడు.

కారణాలు: **క్షణికావేశం, మద్యం మత్తు, పాత గొడవలు**

■ కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశంను అతని బావమరిది భూపతి గంగారాం ఈ నెల 1న హత్య చేసి వరదకాలువలో తోశాడు. కారణాలు: **మల్లేశం నేర చరిత్ర, గంగారాం చెల్లెలు లావణ్య, కోడలుకు మల్లేశం నుంచి వేధింపులు**

■ రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం జవహర్ నాయక్ తండాలో గుగులోతు సుశీలను భర్త రవి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ నెల 12న ఈ ఘటన జరిగింది. కారణాలు: **మద్యం మత్తు, భార్య అనుమానించడం**

■ వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన మామిండ్ల మల్లయ్యను సెప్టెంబరు 29న మొదటి భార్య కుమారుడు మామిండ్ల రాజు సహా ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు అల్లుల్లు కలిసి హత్య చేశారు. కారణం: **ఆస్తి పంపకాలు**

■ జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్ రాజును అక్టోబరు 1న అతని సోదరుడు విక్రం రాజు హత్య చేశాడు. కారణం: **భూ తగాదాలు**

ఆప్యాయతలే బలం.. బలగం

కుటుంబాల మధ్య ఆప్యాయతలు పెరగాలి కానీ అంతరాలు ఎక్కువవుతున్నాయి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరేం చేసేదీ, మానసిక ప్రవర్తనపై కుటుంబ పెద్దలకు అవగాహన ఉండేది. ఇప్పుడు చరవాణి సహా ఇతర మాధ్యమాల దుష్ప్రభావం బంధాలను చెరిపేస్తున్నాయి. ఆస్తులే ముఖ్యం కాదనే భావన పెరిగినప్పుడు దాడులకు స్థానం ఉండదని మానసిక నిపుణులు చెబుతున్నారు. హత్య లాంటి విపరీత చర్య అనంతరం ప్రాయశ్చిత్త పడటం కంటే అనుబంధాలు, ఆప్యాయతలను వల్లె వేసుకుంటే కుటుంబం ప్రశాంతతకు చిరునామాగా మారుతుంది. ఒకరికొకరు బలం, బలగం అనే భావన ఉంటే రక్తపు మరకలే అంటవు అని నిపుణులు పేర్కొంటున్నారు.

భావోద్వేగాలను నియంత్రించుకోలేకనే..


- డాక్టర్ వీరేందర్, మానసిక నిపుణుడు



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. దుబాయి వెళ్లి కొందరు ఎక్కువ డబ్బులు సంపాదిస్తే ఇంకొందరు వారిపై అసూయ పెంచుకుంటున్న పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో భూ వివాదాలు కూడా ఎక్కువయ్యాయి. డబ్బు కోసం ఏమైనా చేయొచ్చు అనే విపరీత ధోరణి పెరగడం వల్లే హత్యలు జరుగుతున్నాయి. మద్యం ప్రభావం కూడా మనిషి ఏం చేస్తున్నాడో తెలియని స్థితికి తీసుకు వెళ్తుంది. భావోద్వేగాలను నియంత్రించుకోలేక ఏం నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియడం లేదు. ఎమోషనల్ కంట్రోల్ తక్కువ.. మనిషిని ఏం చేస్తుందని తెలీదు. బంధాలు కూడా ఈ కారణాల వల్లే దూరమవుతూ హత్యలు పెరుగుతున్నాయి. హత్యలు చేసేవారికి ఐక్యూ లెవల్స్ తక్కువ ఉన్నట్లు మేం భావిస్తాం.

మద్యం, ఆస్తులు కారణమవుతున్నాయి

- రఘుచందర్, డీఎస్పీ జగిత్యాల



మద్యం మత్తులో, వివాహేతర సంబంధాల వల్ల, ఆస్తుల గొడవలతో ఎక్కువగా హత్యలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు చెడిపోవడంతో హత్యలు కూడా పెరుగుతున్నాయి. సాధారణ హత్యల కంటే రక్తసంబంధీకుల మధ్య హత్యలు విపరీత ధోరణులకు అద్దం పడుతున్నాయి. ఠాణాలకు వివిధ సమస్యలపై వచ్చేవారిని పరిశీలిస్తే... ఆస్తి తగాదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కౌన్సెలింగ్ ద్వారా పలు కుటుంబాలు కలిసి మెలిసి ఉంటున్నాయి. ఉమ్మడి కుటుంబ విధానం, విలువలతో కూడిన జీవనం లాంటి వాటిపై అవగాహన కలిగిస్తే రక్త సంబంధీకుల మధ్య గొడవలు, దాడులు, హత్యలు తగ్గించవచ్చు.

ప్రశస్త్‌తో దివ్యాంగ లక్షణాల గుర్తింపు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



ప్రశస్త్ యాప్

పిల్లల్లో దివ్యాంగ లక్షణాలు ఉంటే సరైన సమయంలో గుర్తించి, చికిత్స అందించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి సంకల్పించింది. బాల్యంలోనే దివ్యాంగ లక్షణాలు కనిపించినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించక పోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ సమస్యలు తీవ్రమవుతాయి. దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స అందించడం ద్వారా మెరుగైన జీవనం గడపగలరు. చిన్నారుల్లో దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో ప్రశస్త్ ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించింది. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి లోపు పిల్లల్లో మూడు దశల్లో దివ్యాంగ లక్షణాల నిర్ధారణ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

■ విద్యార్థులు ఇంట్లో కంటే పాఠశాలలోనే అధిక సమయం గడుపుతారు. ఈ క్రమంలో చిన్నారుల నడకలో తేడా, లేదంటే నడవడానికి ఇతరుల సహాయం తీసుకోవడం, శరీరంలోని భాగాల కదలికలో తేడా, మెడ, చేతులు, వేళ్లు, మణికట్టు, కాళ్లు వంటి 21 రకాల దివ్యాంగ లక్షణాలను ఉపాధ్యాయులు గుర్తించే అవకాశం అధికంగా ఉంటుంది. దివ్యాంగ లక్షణాలు గల చిన్నారులను గుర్తించి వారిని ప్రశస్త్ యాప్‌లో పొందుపరుస్తారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చరవాణుల్లో మెయిల్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

■ విద్యార్థుల్లో దివ్యాంగ లక్షణాల గుర్తింపు ప్రక్రియ మూడు దశల్లో జరగనుంది. మొదటిదశలో ఉపాధ్యాయుడు రెండు వారాలపాటు గమనించి వివరాలను 26లోగా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో గుర్తించిన విద్యార్థులను శిక్షణ పొందిన నిపుణులు గమనించి మరోమారు యాప్‌లో నమోదు చేస్తారు. చివరి దశలో విద్యార్థి తల్లిదండ్రులకు వివరించి, బాల్యంలోనే మెరుగైన చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారి అనుమతి మేరకు పరీక్షలకు పంపించనున్నారు.

పాత కక్షలతోనే యువకుడి హత్య

కోరుట్ల, న్యూస్‌టుడే: పాతకక్షలతోనే యువకుడి హత్య జరిగినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ప్రకాశంరోడ్డుకు చెందిన పంబాల మధు, ఇప్పకాయల నరేశ్‌తో బోయిని సాగర్‌కు ఈనెల 13న రాత్రి గొడవ జరిగింది. గుద్దేటి వెంకటేశ్ వీరి మధ్య రాజీకి యత్నించగా సాగర్ ఒప్పుకోలేదు. సాగర్ తమను ఎప్పటికైనా చంపుతానని బెదిరించాడని మధు, నరేశ్ వెంకటేశ్‌తో చెప్పారు. ఈనెల 14న రాత్రి 10 గంటల ప్రాంతంలో ప్రకాశంరోడ్డులోని పంబాల నాగరాజు ఇంటికి వెళ్లిన సాగర్ అతడితో గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న గుద్దేటి వెంకటేశ్, గుద్దేటి విజయ్, పంబాల రాకేశ్ సంఘటన స్థలానికి వెళ్లి సాగర్‌ను రోడ్డుపై నెట్టివేయడంతో కిందపడ్డాడు. వెంటనే వెంకటేశ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సాగర్ గొంతుకోసి హత్య చేశాడు. అనంతరం నిందితులు ఘటన స్థలం నుంచి పరారయ్యారు. సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది నిందితుల కోసం గాలింపు చేపట్టారు. గురువారం కోరుట్ల శివారులోని గుద్దేటి వెంకటేశ్‌కు చెందిన నాగులమ్మ బ్రిక్స్ తయారీ ఫ్యాక్టరీ వద్ద నిందితులు అయిదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఒక కత్తి, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులలో ఒకరైన పంబాల నాగరాజు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని, ఇతరుల ప్రమేయం ఉన్నట్లు తేలితే చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ స్థలాల కబ్జా

న్యూస్‌టుడే, గంగాధర

పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు.

విలువైన భూముల్లో అక్రమ కట్టడాలు

తేల్చని హద్దులతో ఆక్రమణలు

గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటి శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది.



కాలువ స్థలంలో వెలసిన నిర్మాణాలు

సర్వే చేసి తొలగిస్తాం

నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం. **- వజహత్ అలీ, ఏఈ**

సీసీఐ కొనుగోళ్లకు రంగం సిద్ధం

నోటిఫై జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాట్లు

న్యూస్‌టుడే, జమ్మికుంట



గురువారం జమ్మికుంటలోని ఓ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రం ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన మార్కెటింగ్ శాఖ అధికారులు

కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్న రైతులకు మద్దతు ధర లభించకపోవటంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధం అవుతున్నారు. జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు క్రమేణా ఎక్కువవుతున్నా అధిక తేమశాతంతో మద్దతు ధర రూ.7,521 పలకని పరిస్థితి ఉంది. పత్తికి మద్దతు ధర అందించేందుకు సీసీఐ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని 18 పత్తి జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసుకోగా అందులో జమ్మికుంటలోనే ఏడు ఉన్నాయి. నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో మార్కెటింగ్ శాఖ అధికారులు గురువారం ఏర్పాట్లు చేపట్టారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించిన పత్తి నాణ్యత, తేమ శాతం, మద్దతు ధర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోళ్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ పనులు మూడు మిల్లుల్లో పూర్తయినట్లు స్థానిక మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉందని ఆయన చెప్పారు.

విక్రయానికి నిబంధనలు : సీసీఐకి పత్తిని విక్రయించేందుకు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను తీసుకురావాలి. ■ పత్తి తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర రూ.7,521 నుంచి 7,720.16 పైసలు దాకా ఉంది.

సీసీఐ నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లులు (జిల్లాల వారీగా)	కరీంనగర్	పెద్దపల్లి	సిరిసిల్ల	జగిత్యాల
	9	4	5	0

అయ్యప్ప మహా పాదయాత్ర ప్రారంభం

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కరీంనగర్ నుంచి కేరళలోని అయ్యప్ప క్షేత్రం శబరిమలకు మహాపాదయాత్ర గురువారం ప్రారంభమైంది. లోక కల్యాణ సంకల్పానికి జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన 24వ మహాపాదయాత్రను గురుస్వామి కావేటి పరమేశ్వర్ భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభించారు. మొదట ఆలయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన దీక్షాపరుల ఇరుముడి బంధనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం కోతిరాంపూర్ గిద్దెపెరుమాండ్ల దేవస్థానంలో పాదయాత్ర భక్తులందరికీ పడిశెట్టి భూమయ్య(టేలా) ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వామి నాగరాజు మాట్లాడుతూ.. 60 మందితో మహాపాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు యాగండ్ల అనిల్‌కుమార్, డి.సంపత్, బండారి శ్రావణ్, రుద్రాక్ష కృష్ణ, ప్రశాంత్, శ్రీహరి, కర్ణాల రాము, గంగుల సురేశ్, దీక్షాపరులు పాల్గొన్నారు.



శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప దీక్షాపరులు

పిడుగుపాటుకు రైతు మృతి



నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన కామిడి నర్సింహారెడ్డి (48) అనే రైతు పిడుగుపాటుతో మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో గురువారం విషాదం నింపింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సింహారెడ్డి తనకు ఉన్న రెండెకరాలతోపాటు మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పొలం వద్ద పాడి ఆవులు, గేదెలను పోషిస్తూ ప్రత్యామ్నాయ ఉపాధి పొందేవాడు. ఎప్పటిలాగే పొలం వద్దకు ఉదయం వెళ్లిన నర్సింహారెడ్డి పాలు పితికి, క్యాన్‌ను పక్కన పెట్టాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా పిడుగుపడి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు అజయ్ ఉన్నారు. పెద్ద దిక్కు అకాల మరణంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు మెండె శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్ తదితరులు పరామర్శించారు.

ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జులై, ఆగస్టు నెలల్లో జరిగిన ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

యాసంగికి సానుకూలం

న్యూస్‌టుడేతో జగిత్యాల పరిశోధనస్థానం ఏడీఆర్

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం



ఉమ్మడి జిల్లాలో అధిక వర్షపాతం కురవటం, భూగర్భ జలమట్టం బాగుండటం, ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు నీరు రానుండటంతో యాసంగిలో గరిష్ఠ విస్తీర్ణంలో పైర్లు సాగులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో వేయదగిని పంటలు, యాజమాన్యం తదితరాలను జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ **గాదె శ్రీనివాస్** 'న్యూస్‌టుడే' ముఖాముఖి ద్వారా వివరించారు. ఆ వివరాలు..

? ప్రశ్న: వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయవచ్చా.

✓ **జవాబు:** నీటి లభ్యతతో వరిని అధికంగా సాగుచేస్తారు. కానీ అనువైనచోట్ల వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల వల్ల రైతులకు మేలు చేకూరుతుంది. వరుసగా ఒకే పంటను సాగుచేస్తే పంట దిగుబడి మందగించడంతోపాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఒకే తరహా పంట సేద్యం వల్ల మార్కెట్‌లో వాటి పరిమాణం పెరిగి సరైన గిట్టుబాటు ధర లభించదు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా భూసారం పెరగడంతోపాటు రైతులు మద్దతు ధరను పొందుతారు. ఆరుతడి పైర్లతో నీటిని ఆదా చేయవచ్చు.

? యాసంగిలో ఏయే పంటలతో సత్ఫలితాలు సాధించవచ్చు.

✓ రైతులు ప్రధానంగా కోతులు, వన్యప్రాణులు, కూలీల సమస్య, మార్కెటింగ్ తదితరాలను పరిగణనలోకి తీసుకోవాలి. మొక్కజొన్న, జొన్న, సజ్జ, పప్పు దినుసులు, నూనె గింజలు, చెరకు, పొద్దుతిరుగుడు, కుసుమ, చిరుధాన్యాలు, ఆవాలు వంటివి ఈ తరుణంలో సాగు చేయవచ్చు. వీటిని వాణిజ్య పరంగా, ఆహారంగా ఉపయోగించేందుకు వీలుండటం వల్ల మార్కెట్‌లో గిరాకీ ఉంటుంది. డిసెంబరు తరవాత వేరుసెనగ, జనవరిలో నువ్వు పంట వేయడం వల్ల దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

? పంటల మార్పిడిపై మీరిచ్చే సలహాలు.

✓ జగిత్యాల, కరీంనగర్, కూనారం పరిశోధనస్థానాలు, ఏరువాక, కృషివిజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాము. ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నాం. అధిక దిగుబడినిచ్చే వంగడాలని ఇస్తూ ఉపయోగించమని సిఫార్సు చేస్తున్నాం. క్రిమికీటకాలు, కోతుల నుంచి పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో సూచనలు అందిస్తున్నాం. ఏ కాలంలో ఎలాంటి పంటలు వేస్తే అధిక దిగుబడి లభిస్తుందో తెలుపుతున్నాము. నూతన వంగడాలను మినీకిట్లుగా రైతులకు అందిస్తున్నాము.

? నూతన సాంకేతికతను రైతులకు ఎలా చేరవేస్తారు.

✓ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా రైతులకు ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తాము. రైతుల క్షేత్రాల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరిశీలిస్తాము. ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన వంగడాల తయారీకి నిరంతరం పరిశోధనలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల వివరాలు ఎప్పటికప్పుడు బుల్‌టెన్ల రూపంలో విడుదల చేస్తున్నాం. శాస్త్రవేత్తల బృందాలను రైతుల క్షేత్రాలకు పంపించి పంటల్ని ఆశించే పురుగుల నివారణకు ఎలాంటి మందులను వినియోగించాలి, ఎంత మోతాదులో ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.